క్లుప్తంగా

తాగునీటి కష్టాలు



బావూజీపేటలోకి శుక్రవారం ట్యాంకర్ రావడంతో నీటి కోసం బారులుదీరిన బిందెలు

ఆదోని టౌన్: పట్టణంలో నీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. వారం, పదిరోజులకోసారి కుళాయిలకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీలకు నీటి ట్యాంకర్లు వెళ్తే జనం గుమిగూడుతున్నారు. బిందెడు నీటి కోసం ఒకరినొకరు తోసుకోవాల్సిన పరిస్థితి. ప్రభుత్వం తరఫున ప్రత్యామ్నాయ చర్యలు కొరవడటంతో పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే తాగునీటి సమస్యను పట్టించుకోకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

పూడికతీత పనుల పరిశీలన

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, రవి, సచివాలయ ఉద్యోగులు విస్తృతంగా పర్యటించారు. వార్డులోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను పరిశీలించారు. పబ్లిక్ కుళాయిల నుంచి నీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి సరఫరా అవుతున్న రా వాటర్ కావడం వల్ల కాచి వడబోసుకుని తాగాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

తీరనున్న తాగునీటి సమస్య

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కి నీరు విడుదల కావడంతో పట్టణానికి నీటి సమస్య పరిష్కారమైంది. కాలువకు శుక్రవారం సుమారు 300 క్యూసెక్కుల మేర నీరు సరఫరా అవుతుండడంతో గుడికల్ చెరువు, ఎస్‌ఎస్ ట్యాంకుల్లో నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.

ఎల్లెల్సీకి సాగు నీరు

నందవరం: మండలంలోని హాలహర్వి గ్రామ పరిధిలోని ఎల్లెల్సీ కాలువకు శుక్రవారం సాగు నీటిని విడుదల చేశారు. ఎల్లెల్సీ నుంచి దేశాయ్ చెరువుకు నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు అందించాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ ఈఈ శైలేశ్వరరెడ్డి, డీఈఈ లక్ష్మణ్‌కుమార్‌కి ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించండి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య

కోసిగి: పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయించాలని హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభావతి ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన

ఆదోని సెంట్రల్: డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన కలిగి ఉండాలని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. శుక్రవారం కళాశాలలోని లైబ్రరీ హాల్‌లో విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాలను నైపుణ్యం కలిగిన వారితో నాలుగు పద్ధతుల్లో బోధన చేయిస్తారన్నారు. అర్థం కాకపోతే మరోసారి వినడానికి వీడియో, ఆడియో, మెసేజ్ యానిమేషన్ రూపాల్లో లైబ్రరీల్లో లభ్యమౌతాయన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల చేత లింక్ ద్వారా ఎన్‌రోల్ చేయించారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంత్రాలయం: నియోజకవర్గంలో బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. హాస్టల్ వసతి లేని కారణంగా ఎంతో మంది బాలికలు చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, రమేష్ పాల్గొన్నారు.

గొంతులెండుతున్నాయ్!

- ఆదోనిలో ఐదు రోజులకొకసారి నీటి సరఫరా
- దాహార్తితో ప్రజల విలవిల



ఒట్టిపోయిన బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు

ఆదోని టౌన్: పట్టణంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. పట్టణ ప్రజలకు నాలుగైదు రోజులకోసారి నీరు సరఫరా అవుతున్నాయి. దీంతో ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. పట్టణానికి బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు, రాంజల నల్లచెరువు నుంచి నీరు సరఫరా అవుతోంది. అయితే బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు ఎండిపోయింది. రాంజల నల్లచెరువులో సంవృద్ధిగా నీరు ఉన్నప్పటికీ ఆ నీరు కలుషితమయ్యాయి, తాగడానికి పనికిరావు. నల్లగా రంగుమారి మందంగానూ, దుర్వాసన వెదజల్లుతుండడంతో ఆ నీటిని అధికారులు ప్రత్యేకంగా మోటార్లు ఏర్పాటు చేసి తోడేశారు. ప్రస్తుతం చెరువు ఖాళీ అయ్యింది. తుంగభద్ర దిగువ కాలువ నుంచి ఆయా చెరువులను నింపుకోవాల్సి ఉంది. అయితే మూడు రోజుల క్రితం టీబీ డ్యాం నుంచి కెనాల్‌లోకి నీరు చేరడంతో అధికారులు చెరువులోకి పంపింగ్ మొదలు పెట్టారు. అయితే చెరువును పూర్తిస్థాయిలో నింపుకునేందుకు 40 రోజుల సమయం పడుతుంది. పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. దాదాపు 3 లక్షల జనాభా ఉంది. నాలుగైదు రోజులు కొన్ని వార్డులకు, ఆరేడు రోజులకొకసారి మరికొన్న వార్డులకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

బసాపురం చెరువులోకి ఎల్లెల్సీ నీటిని పంపింగ్ చేస్తున్నాం



తుంగభద్ర జలాశయం నుంచి నీరు విడుదలైంది. కాలువలో ప్రవహిస్తున్న నీటిని బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకులోకి పంపింగ్ చేస్తున్నాం. 40 రోజుల్లో చెరువు పూర్తిస్థాయిలో నిండుతుంది. ఆ తరువాత నీటి కష్టాలు ఉండవు. నిన్న, మొన్నటివరకు నీరు లేక ఇబ్బందులు పడ్డారు. తుంగభద్ర నీరు రావడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లే. – రామచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఏడు రోజులుగా నీటి సరఫరా లేదు



వారం, పది రోజుల నుంచి నీటి సమస్య తీవ్రమైంది. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు ఎండిపోయింది. టీబీ డ్యాం నుంచి కాలువ ద్వారా వచ్చే నీటిని చెరువులో పంపింగ్ చేస్తున్నారు. చెరువు సగభాగం నిండితేగానీ పట్టణానికి పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయలేని పరిస్థితి. చెరువును అధికారులు పూర్తిస్థాయిలో నింపాలి. నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.
– నింగమ్మ, ఇందిరానగర్

ఇబ్బందులు పడుతున్నాం



తాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటితో పాటు వాడుకోవడానికి, బట్టలు ఉతికేందుకు కూడా అవస్థలు తప్పడం లేదు. అధికారులు మూడు, నాలుగు రోజులకొకసారైనా నీటిని సరఫరా చేయాలి. – పార్వతమ్మ, ఎస్‌కేడీ కాలనీ

నియోజకవర్గంలో వర్షాలు ఆశించినస్థాయిలో కురవకపోవడంతో చెరువులోకి నీరు చేరలేదు. దీంతో పాటు గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి సమస్య నెలకొంది.

మాజీ సైనికులకు సన్మానం



మాజీ సైనికులను సన్మానించిన దృశ్యం

ఆదోని అర్బన్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేపీ యువమోర్చా పట్టణ అధ్యక్షుడు వై.శ్రీకాంత్ అధ్యక్షతన శుక్రవారం మాజీ సైనికులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విట్టా రమేష్ మాట్లాడుతూ కార్గిల్ పోరులో దేశానికి విజయాన్ని అందించడంతో తమ ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులను స్మరించుకోవడం మన విధి అన్నారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్‌కుమార్, నాయకులు రెడ్డి, యూనుస్‌ఖాన్, భాస్కర్, కబీర్, గిరిబాబు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రంపై చర్యలు తీసుకోండి

కౌతాళం: స్థానిక మీ సేవా కేంద్రంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి జగదీష్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆదాయ, నివాస, అడంగల్, పాస్ పుస్తకాలు తదితర అవసరాల నిమిత్తం వచ్చే వారిని మీసేవా కేంద్రం నిర్వాహకులు దోచుకుంటున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రంగస్వామి

ఎమ్మిగనూరురూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ రంగస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడివెళ్ల సచివాలయంలో తాగునీరు, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వేడి చేసుకొని నీటిని తాగాలన్నారు. నీటి ట్యాంకులను నెలలో రెండు సార్లు శుభ్రం చేయించాలని, క్లోరినేషన్ నీటిని సరఫరా చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మీ, హెచ్‌ఎం ఈశ్వరరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక విత్తన దుకాణాల్లో శుక్రవారం పత్తికొండ, ఎమ్మిగనూరు ఏడీఏలు మోహన్‌విజయ్‌కుమార్, మహమ్మద్‌ఖాద్రీ తనిఖీలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, పత్తికొండ ఏఓలు ఏఓ మహేశ్వరరెడ్డి, మునెమ్మతో కలిసి దుకాణాల్లోని రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఏడీఏలు మాట్లాడుతూ కిరణ్ హైబ్రీడ్, శ్రీ భువనేశ్వరి ఏజెన్సీ, శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఏజెన్సీ, న్యూ గణేష్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. శ్రీ భువనేశ్వరి ఏజెన్సీలో రూ. 12,960ల విలువ టమోట విత్తనాలు, శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఏజెన్సీలో రూ. 54,145 విలువ మిరప విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశామన్నారు. ఆయా కంపెనీల నుంచి సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ చూపించనందున విక్రయాలను నిలిపివేశామని చెప్పారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి



ఆదోని-ఎమ్మిగనూరు రహదారిపై ధర్నా చేస్తున్న పీడీఎస్ఓ నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలోని విశ్వనారాయణ ప్రైవేట్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ డివిజన్ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆదోని-ఎమ్మిగనూరు రహదారిపై పీడీఎస్ఓ నాయకులు, విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నిబంధన మేరకు అకడమిక్ ఇయర్ ప్రారంభమైనప్పటి నుంచి బోధన సాగించాలన్నారు. అయితే కేవలం జూన్ నుంచి నవంబర్, డిసెంబర్ వరకు మాత్రమే బోధన చేయించి, ఆ తరువాత అధ్యాపకులు లేకుండా స్టడీ అవర్స్ పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అలాగే కొత్తగా వచ్చిన ఒకేషనల్ కోర్సులకు ఫ్యాకల్టీ లేరన్నారు. మరోపక్క విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా కన్వీనర్లు నిఖిత, కృష్ణవేణి, డివిజన్ నాయకులు అశోక్, గోవిందు, బసవ, ప్రవీణ్, నవీన్‌కుమార్, అజయ్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఆదోని రూరల్: మండలంలోని నాగలాపురం గ్రామంలో సాగు చేసిన కొర్ర, వేరుశనగ, పత్తి పంటలను కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఆదోని ఏడీఏ డా.అరుణకుమారి శుక్రవారం పరిశీలించారు. వేరుశనగ, కొర్ర, పత్తి పంటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వేరుశనగ పంటలో పొగాకు లద్దె పురుగు గమనించామన్నారు. నివారణకు ఎకరాకు 5 కిలోల బెల్లం, 5 కిలోల తవుడు, క్లోరోపైరీఫాస్ కలిపి సాయంత్రం వేళల్లో ఉండలుగా చేసి పొలంలో వెదజల్లాలన్నారు.బెట్టకు వచ్చిన పంటకు 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కొర్ర పంటలో కాండం తొలుచు పురుగును గమనించామని, నివారణకు కెల్డాన్ కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ మందును ఎకరాకు పావు కిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తి పంటలో దోమ ఉధృతిని తగ్గించడానికి పసుపు రంగు అట్టలను ఎకరాకు 10 చొప్పున మొక్క కంటే కొద్దిగా ఎత్తులో ఉంచాలన్నారు. మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



అపరిశుభ్రతను చూపుతున్న విద్యార్థులు

మంత్రాలయం: నియోజకవర్గంలో ఆయా హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి థామస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ నిర్వహణలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు విఫలామయ్యారని ఆరోపించారు. మురుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్లవలసివస్తుందన్నారు. కనీసం వంట మనిషి, వ్యాచ్‌మెన్, కమాటీ, ట్యూటర్లు కూడా లేరన్నారు. ఇన్‌చార్జ్ వార్డెన్‌ను నియమించడంతో హాస్టల్ నిర్వహణ దారి తప్పిందన్నారు. వసతి గృహంలో ఫ్యాన్లు, దుప్పట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఆందోళనలో నాయకులు దస్తగిరి, వీరేష్, రాజు, రాము, పాపయ్య పాల్గొన్నారు.

గుండమ్మ కుటుంబానికి రూ.5లక్షల సాయం



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో గుండమ్మ కుటుంబ సభ్యులు

ఆదోని టౌన్: మండలం నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన దళిత గుండమ్మను అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు ఈనెల 12న ట్రాక్టర్‌తో తొక్కించి అత్యంత దారుణంగా హత్య చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో రూ.5 లక్షలు సాయంగా అందజేశారని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మృతురాలి కుమారుడు కిశోర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, గ్రామ సర్పంచ్ వరదప్ప, మృతురాలి మరిది రవికుమార్, గ్రామ నాయకులు భాస్కర్‌రెడ్డి, వల్లపురెడ్డి, హులైప్ప తదితరులు మాజీ ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తక్షణ అవసరాలకు నిధులు మంజూరు

ఆదోని అర్బన్: ఆదోని పురపాలక సంఘానికి తక్షణ అవసరాల కోసం రూ.1.24 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శుక్రవారం పురపాలక శాఖ మంత్రి నారాయణను కలిసి ఆదోని పురపాలక సంఘం పరిధిలోని విస్తరణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి రూ.44 కోట్ల అవసరమని కోరారు. పట్టణంలోని విస్తరణ ఏరియాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు లేవని, నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి తక్షణ అవసరాల కోసం రూ.1.24 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు.

సచివాలయ సిబ్బందితోనే పింఛన్ల పంపిణీ

కౌతాళం: సచివాలయ సిబ్బందితోనే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 8,624 మంది పింఛన్లకు రూ.3,62,95,000 నిధులు మంజూరయ్యాయన్నారు. ఆగస్టు 1 పింఛన్‌దారులు అందుబాటులో ఉండి సచివాలయ ఉద్యోగులతో పింఛన్ తీసుకోవాలన్నారు.

కొడిపీర్ల ఊరేగింపు

కౌతాళం: కొడిపీర్ల (చిన్నమొహరం) ఊరేగింపును మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హసన్, హుసేన్ త్యాగ నిరతికి ప్రతీకగా బదినేహాల్ గ్రామంలో కొడల్‌పీర్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

కోచింగ్ సెంటర్లపై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్: డీఎస్సీ, నవోదయ, గురుకుల తదితర పరీక్షల కోచింగ్ సెంటర్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్రిది, ఆర్‌యూఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈఓ-2 మధుసుదన్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

వాహనాల వేలం

ఆదోని రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన 24 వాహనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని సెబ్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో రూ.2,13,000 ఆదాయం వచ్చింది. సెబ్ సీఐ విన్నీలత, ఎస్ఐ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత కొలువులు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివితే పోటీపరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉన్నత కొలువులు సాధించేందుకు వీలవుతుందని స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో విష్ణు ఐఏఎస్ హైదరాబాద్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు 110 రకాల ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ముఖ్యంగా సివిల్స్, గ్రూప్స్ వంటి ఉద్యోగాలపై దృష్టి సారించాలని సూచించారు. కోచింగ్ సెంటర్ అధ్యాపకులు యోగి పోటీ పరీక్షల తీరును వివరించారు. సదస్సులో కోచింగ్ సెంటర్ ఏడీ నరేష్, ఇన్‌చార్జ్ రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుశీలమ్మ, క్రాంతికుమార్, కిరణ్‌కుమార్, తిప్పేస్వామి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలు



స్వర్ణోత్సవ షీల్డ్‌ను అందుకుంటున్న ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు వ్యవసాయంలో తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.రాఘవేంద్రచౌదరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవ(50) వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొదటి సారిగా పాండిచ్చేరిలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించి 50 ఏళ్లు పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో 731 కేవీకేలు రైతులకు సేవలు అందిస్తున్నాయని చెప్పారు. సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు శాస్త్రవేత్తలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే పెట్టుబడి ఖర్చుల తగ్గి లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. పంట సాగుకు ముందు పొలంలోని మట్టి నమూనాలను పరీక్షలు చేయించి వాటికి అనుగుణంగా సాగు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం రైతుల సమక్షంలో కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.రాఘవేంద్రచౌదరి స్వర్ణోత్సవ షీల్డ్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నిరంజన్‌రెడ్డి, మౌనిక, అగ్రికల్చర్ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడే ప్రతి పౌరుడు సైనికుడే



కార్గిల్ దివాస్ వేడుకల్లో మాజీ బీఎస్‌ఎఫ్ జవాన్ ఎస్.ఎం. ఇస్మాయిల్, ప్రిన్సిపాల్ కవిత

ఎమ్మిగనూరురూరల్: దేశం కోసం పోరాడే ప్రతి పౌరుడు సైనికుడేనని మాజీ బీఎస్‌ఎఫ్ జవాన్, ఆపరేషన్ విజయ్ మెడల్ గ్రహీత షేక్‌మహమ్మద్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ బీఎస్‌ఎఫ్ జవాన్ షేక్‌మహమ్మద్ ఇస్మాయిల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత భూభాగాలను అక్రమించుకోవాలని చూసి పాకిస్తాన్ సైనికులను మన దేశ ఆర్మీ పరాక్రమాన్ని చూపించిదని చెప్పారు. ఆపరేషన్ విజయ్ పేరిట కార్గిల్ నుంచి పాకిస్తాన్ చొరబాటుదారులను తరిమివేసిందని గుర్తు చేశారు. అనంతరం మాజీ జవాన్‌ను స్కూల్ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో చాంప్స్ ఇన్‌చార్జ్ అనూరాధ, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఎస్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

ఆర్డీఎస్‌కు జలకళ

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలో తుంగభద్ర నదిపై నిర్మించిన రాజోలి బండ డైవర్షన్ స్కీమ్(ఆర్డీఎస్) ఆనకట్ట వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కర్ణాటక రాష్ట్రంలోని హొస్పేట్ డ్యామ్ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు డ్యామ్ నిండుకుండలా తయారైంది. దీంతో అధికారులు తుంగభద్ర నదికి నీటిని విడుదల చేశారు. శుక్రవారం ఉదయం నాటికి ఆర్డీఎస్ కట్టపై రెండు అడుగులు మేరకు ఎక్కి దిగువ ప్రాంతాలకు ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ మురళీ ఆర్డీఎస్ ఆనకట్టను పరిశీలించి నది తీర గ్రామ పొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, నది వైపు ఎవరూ వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు, బసవరాజు, బాలస్వామి ఉన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర

తుంగభద్రమ్మ ఉరకలు

నందవరం: ఎగువన కురిసిన వర్షాలకు తుంగభద్రమ్మ పొంగి పొర్లుతోంది. టీబీ డ్యామ్ నుంచి భారీగా వరద నీరు దిగువకు విడుదల చేయడంతో తుంగభ్రమ్మ ఉరకలు వేస్తోంది. నదీ తీరం వరద ప్రవాహంతో కళకళలాడుతోంది. రైతులకు సరైన సమయానికి సాగు నీరు చేరింది. తుంగభద్రకు 95 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో నదీ తీర ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలు జీవం పోసుకున్నాయి. వరి సాగుకు అనువుగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల్లో వరి నాట్లకు రైతులు సిద్ధమవుతున్నారు.

తుంగభద్ర జలాలకు పూజలు

కౌతాళం: విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో అధికారులు తుంగభద్రనదికి నీరు వదిలారు. ఈ నీరు ఆంధ్ర సరిహద్దు ప్రాంతం మేళిగనూరు వద్దకు చేరుకోవడంతో శుక్రవారం రైతులు గంగ పూజలు నిర్వహించారు. ఇక్కడ వర్షాలు లేకపోయినా తుంగభద్ర నదికి నీరు రావడంతో తమకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని రైతులు తెలిపారు.

అదనపు గదుల నిర్మాణాలు పూర్తి చేయాలి

గోనెగండ్ల: మండలంలోని చిన్నమరివీడు, కులుమాల తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు పవన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాఠశాలల్లో జరుగుతున్న గదుల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు నాడు-నేడు కింద నిధులు కేటాయించి అదనపు గదుల నిర్మాణాలు చేపట్టిందని గుర్తు చేశారు. అయితే కొన్ని నిర్మాణాలు ఆగిపోయాయని, టీడీపీ ప్రభుత్వం వాటిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొన్ని గ్రామాల విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదని, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఉసేని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవన్, శ్రీకాంత్, హుసేన్ పాల్గొన్నారు.